## క్లుప్తంగా

### కాలనీ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న రాహుల్

సుల్తానాబాద్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్‌కు అంబేడ్కర్ సంఘం నాయకులు శనివారం కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సుభాష్ నగర్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ఎస్సీ శ్మశాన వాటికలో నీళ్ల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బోరింగ్‌కు మరమ్మతు చేయాలని విన్నవించారు. అంబేడ్కర్ సంఘం సుభాష్‌నగర్ కాలనీ అధ్యక్షుడు ఆరెపల్లి రాహుల్, ఉపాధ్యక్షులు ఆరెపల్లి రాకేశ్, ప్రధాన కార్యదర్శి చిలుముల ప్రదీప్, కార్యదర్శి ఆరెపల్లి రితేశ్, కార్యవర్గ సభ్యులు న్యాతరి మోహన్, మామిడిపల్లి తిరుపతి, చిలుముల ప్రణయ్, ఆరెపల్లి రాహుల్, చోటు, ఉప్పులేటి రవి వర్మ, కొయ్యడ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

### 'పది' విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న ఎంఈవో మహేశ్

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర సర్కార్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈవో మహేశ్ ప్రారంభించారు. హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్లకార్డులతో సీఐటీయూ నిరసన




నిరసన తెలుపుతున్న నాయకులు

జ్యోతినగర్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం ఏంటని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భిక్షపతి, జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్మిక, రైతు, ప్రభుత్వ రంగ సంస్థలకు అనుకూలంగా బడ్జెట్ సవరించాలని వారు డిమాండ్ చేశారు. అసంఘటిత రంగం కార్మికులకు వర్తించే కనీస వేతనాలను రూ.26వేలుగా నిర్ణయించాలని, పెట్రోల్, డీజిల్‌పై విధించిన పన్నులు తొలగించి జీఎస్టీ కిందికి తీసుకురావాలని కోరారు. కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత చట్టాలని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, విభజన హామీలకు అనుగుణంగా బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయింపులు చేయాలన్నారు. కోకన్వీనర్ మల్లేశ్, రాఘవరెడ్డి, మల్లేశం, చంద్రమౌళి, శంకర్, విజయ్, రాజయ్య, గోపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, కనకయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

### ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న మహిళలు

మంథని: మంథనిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శ్రీవిష్ణు పారాయణ సభ్యుల వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, పులిహోర నైవేద్యం సమర్పించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు రంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా మండలంలోని పెద్దకల్వల, పెద్దబొంకూర్, నిట్టూరు, నిమ్మనపల్లి, కలెక్టరేట్, రంగంపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# అర్ధంతరంగా నిలిచిన అభివృద్ధి పనులు

- తాగునీటి సరఫరాలో అంతరాయం
- నత్తనడకన సంప్ నిర్మాణ పనులు
- ప్రతిపాదనలకే పరిమితమైన డ్రైనేజీ నిర్మాణం



నిలిచిన ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులు



నిలిచిన సంపు నిర్మాణ పనులు

రామగుండం: రామగుండం పరిధిలోని 20, 22వ డివిజన్లలో సదుపాయాలకు సంబంధించి అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాలకవర్గం గడువు జనవరి 26తో ముగిసింది. కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ ఎదుట నుంచి పాత ఎంపీడీవో కార్యాలయం వరకు రూ.40లక్షలతో నిర్మిస్తున్న సీసీ ఓపెన్ డ్రైనేజీ నిర్మాణ పనులు నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. ఎస్టీ, బీసీ కాలనీలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఎదురవడంతో ప్రత్యేకంగా పాత ఎంపీడీవో కార్యాలయంలో రూ.22లక్షల నిధులతో సంప్ నిర్మాణ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. 22వ డివిజన్ పరిధిలో జీరో పాయింట్ నుంచి శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం వరకు ఏళ్లుగా ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఫలితంగా డ్రైనేజీలు పూర్తిగా శిథిలావస్థకు చేరి మురుగు నీరు ఎక్కడికక్కడ నిలుస్తోంది. వర్షాకాలంలో ప్రధాన రహదారి మీదుగా పారుతోంది. ఇక అయోధ్యనగర్, రామ్‌నగర్, గిర్నీ గల్లీ, ఖాదర్ కాలనీ, మహబూబ్‌కాలనీ, భీమయ్యకాలనీల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రతిపాదనల్లోనే మగ్గుతున్నాయి. అసంపూర్తి దశలో ఉన్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న పనులు ప్రారంభించాలని డివిజన్ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# ఘనంగా మార్కండేయస్వామి జయంతి



పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్‌లో..



ధర్మారంలో..



యైటింక్లయిన్‌కాలనీ: నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో శనివారం మార్కండేయస్వామి జయంతి కార్యక్రమం నిర్వహించారు. మార్కండేయ పురాణం రాసి మానవజాతికి ఆదర్శ ప్రాయుడయ్యారని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి అన్నారు.

**పద్మశాలీ ఉద్యోగులకు సత్కారం..**

పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ఉద్యోగులను సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని జిల్లా కమిటీ అధ్యక్షుడు కొలిపాక సారయ్య, ప్రధాన కార్యదర్శి కోటేశం సన్మానం చేశారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు తెలుకుంట శ్రీ మార్కేండేయ ఆలయంలో శనివారం పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో శ్రీ మార్కేండేయ జయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పూజారి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో సభ్యులు మేరుగు రమేశ్,సత్యం, ఉప్పుల తిరుపతి,బైరి భూమయ్య,సంబారి అంజనేయులు, రాయమల్లు, కనుకయ్య, శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని నందిమేడారం భక్త మార్కండేయ స్వామి ఆలయంలో శనివారం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కుంట రాజు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల భక్త మార్కండేయ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ వలస నీలయ్య దంపతులు క్షీరాభిషేకం చేశారు.

ముత్తారం: ముత్తారంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి నిర్వహించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రీభక్త మార్కండేయ జయంతి నిర్వహించారు. స్థానిక హనుమాన్ నగర్‌లోని పద్మశాలి సేవా సంఘం భవన్‌లో మార్కండేయ చిత్రపటానికి నివాళి అర్పించారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో భక్త మార్కండేయునికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు.

## చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్ఈ విజేందర్

రామగుండం: ప్రతీ ఒక్క ఉద్యోగి చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజేందర్ అన్నారు. రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్, భారత్ మజ్దూర్ యూనియన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఇంజనీర్లు డీఈ శంకరయ్య, శ్రీనివాస్‌రావు, బాలకృష్ణ సూర్యనారాయణరెడ్డి, ఏఏవో బీరెల్లి అనిత, మేడం దయాకర్, ఇస్మాయిల్, యూనియన్ ప్రతినిధులు గుర్రాల నర్సింహులు, లగిశెట్టి రవికుమార్, నాగమల్లు, సాదు కనకయ్య, అధ్యక్ష, కార్యదర్శులు జాగటి శ్రీకాంత్‌కుమార్, శ్రావణ్‌కుమార్, అర్షణపల్లి రాజయ్య, రాజేశ్, రాకేశ్, ఆకర్ష్ ఉన్నారు.

## మహార్యాలీకి బార్ అసోసియేషన్ మద్దతు



ర్యాలీగా వెళ్తున్న అడ్వకేట్‌లు

గోదావరిఖనిటౌన్: వేయి గొంతులు, లక్ష డప్పులతో హైదరాబాదులో నిర్వహించనున్న మహార్యాలీకి ఎంఎల్ఎఫ్ బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం మద్దతు తెలిపారు. ఫిబ్రవరి 7న నిర్వహించే హైదరాబాద్ మహా ర్యాలీకి మద్దతుగా గోదావరిఖని కోర్టు నుంచి డప్పులతో ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీగా నిర్వహించారు. అడ్వకేట్‌లు జూపాక వెంకటి, ఆసంపల్లి రవి, ఐరుగురాళ్ల సంతోష్, బల్మూరి అమరేందర్‌రావు, పులిపాక రాజ్‌కుమార్, సంజయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ కన్వీనర్ కన్నూరి ధర్మేందర్, పల్లె బాబు, కాసిపాక రాజయ్య, మడిపల్లి దశరథం, జీవన్, వద్దూరి శ్రీనివాస్, కోటిపల్లి దుర్గాప్రసాద్, దాసరి ఎల్లయ్య, పల్లె రాజయ్య, శైలజ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**• బహుమతి ప్రదానం**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ–1 కేంద్రం చిన్నారులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా ఎంపికైన వారికి గ్రామానికి చెందిన బొబ్బిలి రాయమల్లు బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి ఉన్నారు.

**• 4న గౌతమి షార్ట్ ఫిలిం ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రారంభం**

మంథని: గౌతమి షార్ట్ ఫిలిం ఆర్టిస్టు అసోసియేషన్‌ను ఈ నెల 4న ప్రారంభిస్తున్నామని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి తెలిపారు. విద్యార్థి యువత ప్రారంభించి 41ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఫిలిం అసోసియేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 11న ఘంటసాల వర్ధంతి సందర్భంగా కళాకారులకు సత్కారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**• సీఐటీయూలో పలువురి చేరిక**

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన పలువురు భవన నిర్మాణ కార్మికులు శనివారం సీఐటీయూలో చేరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల కుమారస్వామి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. బెక్కం స్వామి, గడదాసు హరీశ్, కట్కూరి శ్రీనివాస్, ప్రేంసాగర్, రాజయ్య, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

**• పేకాట స్థావరంపై దాడి**

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి పొత్కపల్లి గ్రామశివారులోని మానేరు వద్ద చెక్‌డ్యాం సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.9050తో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

**• నియామకం**

కాల్వశ్రీరాంపూర్: చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మండలంలోని కూనారం గ్రామానికి చెందిన సిరిపురం శారదను శనివారం నియమించారు. తన నియామకానికి సహకరించిన చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గజ్జెల తార, జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు ఆడెపు శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**• ప్రభుత్వ స్థలంలోనే ఇందిరమ్మ గృహాలు నిర్మించాలి**

రామగుండం: టీటీఎస్ అంతర్గాంలోని బర్మా, శ్రీలంక, కాందిశీకుల కుటుంబాలలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తుడు ఇండిబిల్లి రామకృష్ణ కోరారు. శనివారం తహసీల్దార్ తూమ్ రవీందర్ పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. పీహెచ్‌సీ సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నెం.255/1లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. దీనిపై క్షేత్ర సర్వే చేపట్టి కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

**• క్రీడాపోటీలు స్నేహభావం పెంపొందిస్తాయి**

రామగుండం: క్రీడాపోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపెల్లి తిరుపతి అన్నారు. పట్టణంలోని జెన్‌కో క్రీడా మైదానంలో వసీం ఆధ్వర్యంలో మసూర్ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఎండీ.గౌస్‌బాబాచ క్రీడాకారులు పాల్గొన్నారు.

**• పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని వ్యక్తిపై దాడి**

గోదావరిఖని: తమపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని దాడికి దిగిన సంఘటన శనివారం స్థానిక జీఎం కాలనీలో జరిగింది. గుండవేన సదన్‌కుమార్ గత నెల సదర్ ఉత్సవానికి సంబంధించి ఫ్లెక్సీని జీఎం కాలనీలో కట్టాడు. దీన్ని అదేకాలనీకి చెందిన నలుగురు వ్యక్తులు సాయితేజ, బన్నీ, మరో ఇద్దరు అతని స్నేహితులు ఫ్లెక్సీ చింపారని పోలీసులు పేర్కొన్నారు. దీనిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సదన్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. తమపై పోలీసు కేసు పెట్టాడని మనసులో పెట్టుకొని సదన్‌కుమార్‌పై కత్తులతో దాడి చేయగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

**• మొరాయించిన ధరణి సర్వర్**

సుల్తానాబాద్: తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చిన వారికి శనివారం ఇబ్బందే ఎదురైంది. జిల్లా వ్యాప్తంగా ధరణి సర్వర్లు మొరాయించడంతో ఆపరేటర్లు, తహసీల్దార్లు చేసేది లేక సాయంత్రం వరకు ఎదురుచూశారు. పలు ప్రాంతాల నుంచి ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు చేరుకున్నారు. సర్వర్ మొరాయించడంతో ఇబ్బందులు పడ్డారు.


## బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్



నామినేషన్ వేస్తున్న కర్రె సంజీవరెడ్డి

సుల్తానాబాద్: బీజేపీ సీనియర్ నాయకుడు కర్రె సంజీవ్‌రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్‌ను శనివారం తన మద్దతుదారులతో కలిసి పెద్దపల్లి పార్టీ కార్యాలయంలో వేశారు. ఎన్నికల ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ, పోల్సాని సంపత్‌రావు, ఆశన్న గారి భూమన్న నామినేషన్‌ను స్వీకరించారు. రెండు రోజుల్లో జిల్లా అధ్యక్ష స్థానాన్ని అధిష్టాన వర్గం ఎంపిక చేయనున్నారు. సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు నాగరాజుయాదవ్, పట్టణ మాజీ అధ్యక్షుడు అల్లంకి రాజన్న, పలువురు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న కరస్పాండెంట్ ఇస్మాయిల్

పాలకుర్తి: మండలంలోని యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సంతోష్ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు సాయి అక్షయ్, శ్రవణ్, హర్షవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 2, 3 తేదీల్లో మంచిర్యాల జిల్లా నస్పూర్ కేజీఏ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్, హెచ్‌ఎం.అఫ్జల్ అభినందించారు.

## సింగరేణి వార్తలు

### ఆర్జీ–2 ఏరియాలో 85శాతం బొగ్గు ఉత్పత్తి



వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని గనుల్లో జనవరిలో 85శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం బండి వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరిలో 10.82లక్షల టన్నుల లక్ష్యానికి 9.22లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన పదినెలల్లో 77.32లక్షల టన్నుల లక్ష్యానికి 72.59లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి తీసి 94శాతంలో నిలిచామన్నారు. రాబోయే రెండు నెలల్లో ఏరియాకు కేటాయించిన లక్ష్యం సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏరియాను అన్ని రంగాల్లో ముందుంచడానికి, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడానికి అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు సమష్టిగా పనిచేయాలని కోరారు.

### ఫారెస్ట్ అడ్వైజర్‌కు సన్మానం

రామగిరి: సింగరేణి సంస్థ అటవీ, పర్యావరణ సలహాదారు ఎంసీ ఫర్గెయిన్‌ను శనివారం ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు కలిశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా రామగుండంకు వచ్చిన ఆయనను ఇల్లందు క్లబ్‌లో సన్మానించారు. ఎస్టేట్ అధికారి ఐలయ్య ఉన్నారు.

### ఆర్జీ–3లో 99శాతం, ఏపీఏలో 61శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల పరిధిలో జనవరికి సంబంధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలను ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు తెలిపారు. ఆర్జీ–3 పరిధిలో 5.88 లక్షల టన్నుల లక్ష్యానికి 5.84 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు. 45.10 లక్ష్యల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి) తొలగింపునకు గాను 43.01 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించినట్లు పేర్కొన్నారు. 6.67 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందని, ఓసీపీ–1లో 3.28 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి 3.09 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు వివరించారు. ఓసీపీ–2లో 2.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి 2.74 లక్షల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ఏపీఏలో 0.18 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి 0.11 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 0.13 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు చెప్పారు.

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం



హైస్కూల్‌లో ప్రత్యేక తరగుతులు

రామగుండం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులను ఆయన పరిశీలించారు. పది విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం గం.3.35 నుంచి 5గంటల వరకు వివిధ సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించాలని టీచర్లకు పలు సూచనలు, సలహాలిస్తున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.



అర్బన్ పార్కులో విద్యార్థుల బృందం

## వనదర్శినిలో అంతర్గాం ప్రభుత్వ విద్యార్థులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని రాజీవ్ రహదారి సమీపంలో ఉన్న అర్బన్ పార్కును శనివారం అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు క్షేత్ర పర్యటన చేశారు. అటవీశాఖ అధికారులు అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ వనదర్శిని యాత్రలో విద్యార్థులు పాల్గొనగా ఫారెస్టు రేంజి ఆఫీసర్ సీహెచ్.నాగయ్య, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ రహ్మతుల్లా, బీట్ ఆఫీసర్ మీర్జా ఇర్షద్‌బేగ్ ఉన్నారు.

## తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నియాజ్



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో భాస్కర్‌రావు

సుల్తానాబాద్: పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ ఆదేశించారు. పట్టణంలోని పలు కాలనీలను శనివారం ఆయన సందర్శించారు. గట్టెపల్లి మానేరు నుంచి సరఫరా అవుతున్న నీటిని, పైపులతోపాటు లీకేజీలను పరిశీలించారు. లీకేజీలు జరుగుతున్న ప్రాంతాల్లో మరమ్మతు చేసి వెంటనే నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక అశోక్ నగర్ సమీపాన ఉన్న మంచినీటి బావితో పాటు విద్యుత్ వాడకాన్ని పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. సిబ్బంది పాల్గొన్నారు.

**ముందస్తు చర్యలు తీసుకోవాలి**

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్‌ను ఎంపీడీవో భాస్కర్ నిర్వహించారు. మంచినీటి బావులను, నీటి ట్యాంకులను పరిశీలించి లీకేజీలు ఉంటే సమాచారం ఇవ్వాలని సూచించారు. రాబోయే వేసవి కాలం దృష్ట్యా మంచి నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లీకేజీలు జరుగుతున్న ప్రాంతాల్లో మరమ్మతు చేసి నీటిని సరఫరా చేయాలన్నారు. ఎంపీవో అరిఫ్ పాల్గొన్నారు.

## లాంగ్ మార్చ్ విజయవంతం చేయండి

కాల్వశ్రీరాంపూర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు, వేల గొంతుల లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి తూండ్ల రాజయ్య, మండల అధ్యక్షుడు బర్ల తిరుపతి, నాయకులు సిరికొండ కొమురయ్య, కనుకుంట్ల అజయ్, తూండ్ల మధునయ్య, ఇనుగాల రాములు, చిలుముల రాజు, శ్రీశైలం, మొగిలి, రాజేశం, రవి, కళాకారుడు ఎండీ రజాక్ పాల్గొన్నారు.

## మహా ప్రదర్శనకు తరలివెళ్దాం

గోదావరిఖనిటౌన్: మహా ప్రదర్శనకు పిడికిలి బిగించి భారీగా తరలివెళ్దామని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య అన్నారు. ఈ సందర్భంగా గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు పది ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి, అందుకు సంబంధించిన అద్దెను శనివారం గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు అందజేశారు. రాష్ట్రం ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను ఆమోదించాలని డిమాండ్ చేస్తూ 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేయి గొంతుకలు.. లక్ష డప్పులు మహా ప్రదర్శనకు నియోజకవర్గం నుంచి మాదిగ, ఉపకులాలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్లు ఇంజపురి పులేందర్, భాస్కర్, కవ్వంపల్లి స్వామి ఉన్నారు.